## దటీజ్ తెలంగాణ

సమైక్య పాలనలో 2008-09 నుంచి 2010-11 మూడేండ్లు సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇచ్చిన వాటా కేవలం 16 శాతం. 2013-14 నాటికి దాన్ని 20 శాతం చేసి రూ.83.75 కోట్లిచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ వాటాను పెంచుతూ వచ్చారు. 2022-23లో సంస్థ లాభాల్లో ఏకంగా 32% (రూ. 711 కోట్లు) ప్రకటించారు.



సంక్షేమం

ఆఖరి మజిలీ గౌరవప్రదంగా నిర్వహించుకోవడానికి, మృతదేహాల అంత్యక్రియల కోసం 12,745 గ్రామాల్లో కేసీఆర్ సర్కారు వైకుంఠధామాలు నిర్మించింది. ఇందుకోసం రూ.1,554 కోట్లు ఖర్చుచేసింది. ఒక్కో వైకుంఠ ధామానికి రూ.12.6 లక్షలను వెచ్చించింది.

వైకుంఠధామం

| | |
|---|---|
| ప్రారంభం | 2019 |
| పూర్తయిన గ్రామాలు | 12,745 |
| ఇప్పటి వరకు చేసిన ఖర్చు | 1,554 కోట్లు |

# చెయ్యి వాశింది

**రేవంతంకు ఫోన్‌లో మేడం క్లాస్.. పార్టీ పరిస్థితిపై గరం..గరం..**

**సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సెటైర్లు**

*రేవంతం సారుకు ఢిల్లీ నుంచి ఫోనొచ్చింది. పెద్ద మేడమ్ ఫోన్ చేశిందని పీఏ చెప్పంగనే అప్పటిదాకా ఆరాంసే కుర్చీల కూసున్న సారు దబ్బుమని నిలవడ్డడు. 'మేడమ్..' అనుకుంట సగం ఒంగిండు.*

**పెద్ద మేడం:** రేవంతం జీ.. మా వాడికి మేడిగడ్డ బరాజ్ మీద ఎక్స్‌పాన్షన్ జాయింట్ చూపెట్టి క్రాక్ అని ఫూల్‌ను చేసిన్రట. ఇదేం పద్ధతి హై.

**రేవంతం:** అంటే మేడం.. అది నిజంగనే క్రాక్ కాదా? అంత పెద్దగ కనిపిస్తున్నది కదా.. అందుకే క్రాక్ అనుకున్న.

**పెద్ద మేడం:** క్రాక్‌కు, జాయింట్‌కు తేడా తెల్వకుండా బరాజ్ చూడనీకి ఎందుకు పోయిండ్రు?

**రేవంతం:** నేను వద్దని చెప్పిన మేడం. ఆడికి పోతే గంత పెద్ద బరాజ్ చూసి అబ్బా.. అని నోరు తెరిశి వచ్చుడు, నీళ్లు, పచ్చటి పొలాలు సూశి సల్లవడుడు తప్ప మనకేం తెల్వదు సార్ అని చెప్పిన. అయినా మన చిన్నబాబు ఇనలే. పోదాం.. పోదాం.. అని మొండిపట్టు వట్టిండు. సరేతియ్యి జెరశేపు ఆనంద పడుతడని తీసుకపోయిన.

**పెద్ద మేడం:** మంచిగున్నరు పో. ఒకడు పెద్ద పప్పు.. ఇంకొకడు తెలంగాణ పప్పు. సరిపోయిన్రు ఇద్దరు.

**రేవంతం:** థాంక్యూ మేడం.

**పెద్ద మేడం:** పప్పు అంటే థాంక్యూ అంటున్నవ్.



**రేవంతం:** నన్ను మీ కొడుకు తోటి సమానంగా పోల్చినరు గదా మేడం.. గందుకే థాంక్యూ చెప్పిన.

**పెద్ద మేడం:** సర్లే.. తెలంగాణల కాంగ్రెస్ భవిష్యత్తు అర్థమైందిగనీ.. చెయ్యి ఎట్లున్నది మరి.

**రేవంతం:** (నా చెయ్యికి ఏమైంది? అని మనసుల అనుకున్నడు. పార్టీ గురించేమో అనుకొని) మంచిగనే ఉన్నది మేడం. మనం గెలుసుడు పక్కా. ప్రభుత్వం మనదే (అని గట్టిగనే కవర్ చేశిండు).

**పెద్ద మేడం:** నేను అడిగింది పార్టీ గురించి కాదు.. దాని సంగతి నాకు ఇప్పుడే అర్థమైందిగనీ.. మీ చెయ్యి జెర ఉబ్బిందని మావోడు చెప్పిండు అందుకనే అడుగుతున్న.

**రేవంతం:** ఓ గదా మేడం.. ఈ మధ్యల జెర పార్టీలో చేరికలు ఎక్కువైనయ్ కదా. అందరికీ పార్టీ కండువాలు కప్పీ.. కప్పీ.. చెయ్యి ఉబ్బింది. గంతే..

**పెద్ద మేడం:** దాన్ని తెలుగుల ఏమంటరు?

**రేవంతం:** వాపు అంటరు మేడం. బెణికినా, నరం మర్లవడ్డా, ఎక్కువ పని చేశినా, అడ్డమైనయన్నీ తిన్నా వాపు వస్తుంటది.

**పెద్ద మేడం:** ఎప్పటికీ అట్లనే ఉంటదా?

**రేవంతం:** అట్లుండది మేడం.. నాలుగొద్దులు ఉండి, తగ్గిపోతది.

**పెద్ద మేడం:** మన పార్టీలో మస్తుమంది చేరుతున్నరని మీరు రిపోర్టులు ఇస్తున్నరు. మావోడు గూడ ఆహా.. ఓహో అంటున్నడు.

**రేవంతం:** అవును మేడం.. మస్తు మంది పెద్ద పెద్ద లీడర్లు వచ్చి జాయిన్ అయితున్నరు.


**పెద్ద మేడం:** వాళ్లతోని క్యాడర్ వస్తున్నదా?.

గంతే.. రేవంతం సారు నుంచి సప్పుడు లేదు.. లీడర్లైతే వస్తున్నరు అని చెప్పుకొచ్చిండు.

**పెద్ద మేడం:** ఆ పార్టీ వద్దనుకున్నోళ్లు, ఈ పార్టీల టికెట్ కూడా తెచ్చుకోలేనోళ్లు..ఇటు ప్రజలు, వేరే పార్టీలు తిరస్కరించిన నాయకులకు మీరు కండువా కప్పుతున్నరు. మస్తు మంది చేరుతున్నరని చెప్పుకుంటున్నరు. పార్టీ మస్తు బలం అయ్యిందని గప్పాలు కొడుతున్నరు. కానీ.. క్యాడర్ లేని లీడర్ వస్తే.. అడ్డమైనయి తింటే చెయ్యి వాశినట్టే పార్టీ కూడా లీడర్లతోని నిండిపోయింది. అది వాపే తప్ప మీరు అనుకునేది కాదు.. (అని క్లాస్ పీకింది).

*(గంతే.. రేవంతం సారు నోట్లకెల్లి ఒక్క మాట బయటికి రాలే. సల్లగ శెమటలు మోపయినయి. వాశిన చెయ్యిని చూసుకుంట.. కళకళలాడుతున్న కారు దిక్కు చూసుకుంట.. నలిగిపోయిన కమలం పువ్వును చేతుల పట్టుకొని తూర్పుదిక్కు తిరిగిండు).*

... కాసాని మహేందర్ రెడ్డి



- వ్యవసాయాభివృద్ధితో ఆహార పరిశ్రమలో సరికొత్త విప్లవం
- దేశంలో 60 శాతం మిఠాయిలు, బిస్కెట్ల తయారీ ఇక్కడే
- దేశీయ ఎగుమతుల్లో 50 శాతానికిపైగా మన రాష్ట్రం నుంచే
- ప్రభుత్వం చేపట్టిన ఐదు విప్లవాలే మార్పునకు నాంది
- సీఐఐ (టీఏఎఫ్‌పీ) చైర్మన్ డా. వీ, రంగయ్య

*పాల కంటే పన్నీరుకే విలువెక్కువ. ఓ పదార్థం మరో పదార్థంగా రూపాంతరం చెందితే దాని విలువ పెరుగుతుంది. ఈ విషయాన్ని గ్రహించిన తెలంగాణ ప్రభుత్వం ఆహార ఉత్పత్తులకు విలువను జోడిస్తూ వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతానికి కృషి చేసింది. ఆహారశుద్ధి పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూనే పాటు రైతన్నలకు లాభం చేకూర్చింది. ఆహారశుద్ధి రంగం ఎదుగుదలకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీఐఐ (తెలంగాణ అగ్రి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్) చైర్మన్ డా. వి రంగయ్య వివరించారు.*

# ఆహార శుద్ధిలో తెలంగాణ టాప్



ఆహారశుద్ధి రంగంలో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుతున్నది. వ్యవసాయ ఉత్పత్తులు పెరగడంతో దానికి అనుబంధంగా ఉండే ఆహారశుద్ధి రంగం విప్లవాత్మక వృద్ధిని సాధిస్తున్నది. దేశీయ కన్ఫెక్షనరీ, బిస్కెట్ ఉత్పత్తుల్లో 60 శాతం వాటా తో హైదరాబాద్ ఈ పరిశ్రమకి ప్రధాన కేంద్రంగా మారింది. అంతేకాదు, ఎగుమతుల్లో 50 శాతం వాటా మన రాష్ట్రానిదే. సీఎం కేసీఆర్ దూరదృష్టి ఫలితం గా తెలంగాణ అటు వ్యవసాయం, ఇటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో తనదైన ముద్ర వేస్తున్నది' అని అన్నారు సీఐఐ (తెలంగాణ అగ్రి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్) చైర్మన్ డాక్టర్ వీ రంగయ్య.

**ప్ర. ఆహారశుద్ధి రంగంలో తెలంగాణ స్థానం ఎక్కడ? పరిశ్రమ వృద్ధికి ఉన్న అనుకూలతలు?**

జ. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఆహారశుద్ధి విధానాన్ని ప్రవేశపెట్టి అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నది. కోకాకోలా, హెరిటేజ్, ఎంటీఆర్, ఐటీసీ, కేఆర్‌బీఎల్ ఫుడ్స్ తదితర దిగ్గజ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. దేశీయ స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్ల ఉత్పత్తిలో తెలంగాణ 60 శాతం వాటా కలిగి ఉంది. విదేశాలకు ఎగుమతి అవుతున్న వాటిలో 50శాతం వరకు మన రాష్ట్రం నుంచే ఉంటున్నాయి. ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్‌లు ఏర్పాటయ్యాయి. మెదక్‌లో ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్‌ను ప్రభుత్వం నెలకొల్పింది. 11 సమీకృత కోల్డ్ చైన్ ప్రాజక్టులను ఏర్పాటు చేసింది.

**ప్ర. స్వరాష్ట్రంలో పరిశ్రమ రంగం వృద్ధి ఎలా ఉంది? ఆహారశుద్ధి రంగంలో ఏ మేరకు ప్రగతి సాధించింది?**

జ. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన నీటి పారుదల ప్రాజక్టులతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా సుమారు 25 శాతంగా ఉంది. ఇది జాతీయ సగటు కన్నా అధికం. లైవ్‌స్టాక్, ఆగ్రో ప్రాసెసింగ్, దాని అనుబంధ రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించింది. వ్యవసాయాభివృద్ధికి హరిత విప్లవం, డెయిరీ రంగ అభివృద్ధికి శ్వేత విప్లవం, చేపల పెంపకానికి నీలి విప్లవం, మాంసం ఉత్పత్తుల పరిశ్రమ అభివృద్ధికి గులాబీ విప్ల వం, వంట నూనెల పరిశ్రమ వృద్ధికి పసుపు (ఎల్లో) విప్లవాలు చేపట్టింది. వీటిని సాకారం చేసేందుకు పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

**ప్ర. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల పురోగతి ఎలా ఉంది? కొత్తగా వస్తున్న పరిశ్రమలకు సరిపడేలా ముడిసరుకు లభ్యత ఉన్నదా?**

జ. రాష్ట్రంలో 35శాతం విస్తీర్ణంలో వరి సాగు జరుగుతున్నది. పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, మిర్చి, మామిడి తదితర పంటల అనుబంధ పరిశ్రమలకు ఢోకా లేదు. మన రాష్ట్రంలో మేలి రకం పత్తి ఉత్పత్తి అవుతుండడంతో యంగ్‌వన్, కిటెక్స్ వంటి అంతర్జాతీయ స్థాయి కంపెనీలు ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయి. పామాయిల్ సాగు, పండ్లతోటల అనుబంధ పరిశ్రమల ముడిసరుకు లభ్యత కూడా బాగానే ఉన్నది.

**ప్ర. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి, డెయిరీ, పౌల్ట్రీ రంగం వృద్ధిపై మీ అభిప్రాయం?**

జ. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో తెలంగాణ పౌల్ట్రీ రంగం గణనీయంగా వృద్ధి సాధించింది. హాట్సన్, హెరిటేజ్, జెర్సీ క్రీమ్ లైన్, దొడ్ల తదితర కంపెనీలు డెయిరీ రంగంలో పెట్టుబడులు పెట్టాయి. ప్రభుత్వ రంగంలోని విజయ డెయిరీ తమ రెండో ప్లాంటును కూడా ఇటీవలే ప్రారంభించింది. గొర్రెల పంపిణీ పథకంతో మాంసం ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదిగింది.

**ప్ర. ఆహారశుద్ధి రంగంలో పరిశోధన, అభివృద్ధి ఏ మేర కు క్రియాశీలకంగా ఉంది? ఫలితాలు ఎలా ఉన్నాయి?**

జ. ఇక్రిశాట్, ఎన్ఐఎన్, ఎన్ఏఏఆర్ఎం తదితర సంస్థలతో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం తదితర విద్యా సంస్థలు నూతన ఆవిష్కరణలకు కృషి చేస్తున్నాయి. ప్రైవేటు రంగంలోనూ పలు అంతర్జాతీయ కంపెనీలు ఆర్ అండ్‌డీలను ఏర్పాటు చేస్తున్నాయి.

**ప్ర. ఆహార ఉత్పత్తులకు మార్కెటింగ్ ఎలా ఉంది?.**

జ. ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ఏపీఈడీఏ సహకారంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ట్రేడ్ షోలలో పాల్గొని వివిధ అంతర్జాతీయ కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పర్చుకుంటున్నది. 2017లో ఢిల్లీలో నిర్వహించిన వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో 11కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఈ ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ ఆహార సదస్సులో వందకుపైగా కంపెనీలు పాల్గొన్నాయి. ఆయా కంపెనీలు రూ.10,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాయి. రవాణా సౌకర్యం కల్పించడమే కాకుండా కోల్డ్ స్టోరేజ్, వేర్‌హౌసింగ్ సౌకర్యాలు కూడా కల్పిస్తున్నది.

**ప్ర. ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏ విధంగా దోహదం చేయనున్నాయి?**

జ. ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రత్యేక ఆహార శుద్ధి మండళ్లను ఏర్పాటు చేస్తున్నది. పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన వస్తున్నది. తెలంగాణ ఆహారశుద్ధిలో అగ్రగామిగా ఎదిగేందుకు ఈ ఆహారశుద్ధి మండళ్లు దోహదపడతాయి. ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాల వల్ల అమూల్, హెచ్‌సీసీబీ, ది ఫిషింగ్ కో, హాట్సన్, ఉమెనోవా, మ్యాన్‌కైండ్, మార్స్ పెట్ ఫుడ్, మొనిన్, ప్లాంట్ లిపిడ్స్, ఇండిజీన్ ప్రొటీన్ ఫుడ్స్ తదితర ప్రఖ్యాతిగాంచిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

... కిశోర్ శుక్లా

## సోషల్ యాంగిల్

# హైప్‌రాప్‌బాద్



*హైదరాబాద్ అంటేనే హైపర్‌గా ఉంటాం*
*బిర్యానీ తింటూనే ఇరానీ ఛాయ్ అంటాం*

*మండే టు ఫ్రైడే మేం ఆఫీస్‌కే పోతాం*
*మెట్రో ఎక్కి దిగే దాక ముచ్చట్లే పెడ్తాం*

*ఐటీ మాదే ఫార్మా మాదే*
*సాటి లేని స్కిల్ ఉన్న సిటీ మాదే*

*కేబుల్ బ్రిడ్జి మీదికెక్కి కేరింతలు కొడతాం*
*స్కై వాక్ మీద మేము క్యాట్ వాకే చేస్తాం*

*సచివాలయం ముందు మేము సెల్ఫీలే దిగుతాం*
*అంబేద్కర్ బొమ్మకేమో సెల్యూట్ కొడతాం*

*ఫస్టు మనమే.. బెస్టు మనమే..*
*అవార్డుల లిస్టుల్లో.. మస్తు మనమే...*

*బోనాల పండుగకు పూనకాలు తెస్తాం*
*దసరా ముంగట మేము బతుకమ్మ ఆడుతాం*

*మనది హైదరాబాదు.. దేశంలో మనదే జోరు*
*మన కేటీఆరు.. ఇగ చూడర జోరు*

**- తాండ గణేశ్, రేడియో మిర్చి (హైదరాబాద్ స్టేషన్)**

## షహర్ కీ బాత్

### అపోహలన్నీ పటాపంచలు

తెలంగాణ ఏర్పాటైతే రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుందన్నారు.. నిర్మాణ రంగం కుప్పకూలుతుందని భయపెట్టారు. ఆ అపోహలన్నింటినీ పటాపంచలు చేస్తూ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడుతున్నది హైదరాబాద్ నగరం. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టే ప్రధాన కారణం. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న అనేక ప్రాజెక్టులతో పాటు ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ కాకుండా నిర్మాణం, ఇంటీరియర్ వంటి వివిధ రంగాల్లో గ్లోబల్ స్థాయి దిశగా నగరం పరుగులు పెడుతున్నది. తెలంగాణ ఏర్పాటు సమయంలో అపోహలు సృష్టించిన అబద్ధాల కోరులకు చెంపచెళ్లు మనేలా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ స్వాగతించాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మద్దతు తెలుపుతూ.. కారు గుర్తుకు ఓటు వేయాలి.



**- ఎంవీ అజయ్‌కుమార్ (అజయ్ అసోసియేట్స్) కిస్మత్‌పూర్, రాజేంద్రనగర్**

# సాగర తీరం.. అభివృద్ధి తోరణం

*ప్రకృతి అందాలకు నెలవు నాగార్జున సాగర్.. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను ఇక్కడ కృష్ణానదిపై నిర్మించారు. సాగర్ జలాశయంలో అతిపురాతనమైన నాగార్జున కొండ పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2009లో అసెంబ్లీ సెగ్మెంట్‌గా ఏర్పడింది. 2018 ఎన్నికల్లో నోముల నర్సింహ్మయ్య 'సాగర్'పై గులాబీ జెండా ఎగురవేశారు. 2020లో ఆయన హఠాన్మరణం చెందాడు. 2021లో జరిగిన ఉపఎన్నికలో ఆయన కుమారుడు బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ కుమార్ విజయం సాధించారు. రెండేండ్లుగా సుమారు రూ. 2,000 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు.*

*- హాలియా*



▪ ఏరియల్ వ్యూ: నాగార్జునసాగర్

*సాగరతీరంలోని బుద్ధవనం*

## బీఆర్ఎస్ సర్కారు హయాంలో రూ.వేల కోట్ల పనులు

**సాగునీటి రంగానికి రూ.813 కోట్లు కేటాయింపు**

**రూ.684 కోట్లతో నెల్లికల్లు ఎత్తిపోతల**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగార్జునసాగర్ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. ప్రభుత్వం నందికొండ, హాలియాలను మున్సిపాలిటీలుగా చేసింది. గిరిజనులు ఎక్కువగా ఉన్న తిరుమలగిరి(సాగర్) నూతన మండలంగా ఏర్పాటు చేసింది. రూ.119 కోట్లతో పట్టణాభివృద్ధి, రూ.200 కోట్లతో గ్రామీణాభివృద్ధి, రూ.813 కోట్లతో సాగునీటి రంగం అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేసింది. మిషన్ కాకతీయ కింద అనేక చెరువులకు మరమ్మతులు చేయగా, రూ.108.57 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నది. రూ.67 కోట్లతో పర్యాటక రంగం, రూ.24.97 కోట్లతో విద్యా రంగం, రూ.25 కోట్లతో వైద్య రంగాన్ని అభివృద్ధి చేసింది.



విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం కొత్తగా 10 సబ్‌స్టేషన్లను సర్కారు నిర్మించింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, వంతెనల నిర్మాణం కోసం రూ.100 కోట్లు, నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.8 కోట్లు, రైతు వేదికల కోసం రూ.7 కోట్లు, దళితబంధు కింద రూ.10 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి ఏటా 1.5లక్షల మంది రైతులకు రూ.125 కోట్లను రైతు బంధు ఖాతాల్లో జమ చేసింది. మృతి చెందిన 1,225 మంది రైతు కుటుంబాలకు రూ.61.25 లక్షలను అందజేసింది. సీఎంఆర్ఎఫ్ కింద రూ.12 కోట్లు, కల్యాణలక్ష్మి 8 వేల మందికి రూ.80 కోట్లు ఇచ్చింది. 1026 మంది గిరిజన రైతులకు పోడు భూమి పట్టాలను అందజేసింది.

### రూ.684 కోట్లతో నెల్లికల్లు లిఫ్ట్

తిరుమలగిరి(సాగర్) మండలంలో 24 వేల ఎకరాలకు సాగునీటి కోసం రూ.684 కోట్లతో నెల్లికల్లు లిఫ్ట్ నిర్మాణం చేపట్టగా, రూ.2.87 కోట్లతో డీ 8, 9 కెనాల్‌పై ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ పనులు పూర్తయ్యాయి. రూ.1.80 కోట్లతో కొణతాలపల్లి లిఫ్ట్ నిర్మాణం పూర్తయ్యింది. సాగర్‌లో రూ.18 కోట్లతో 100 పడకల దవాఖాన అందుబాటులోకి వచ్చింది. హాలియాలో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 400 మంది పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.



నెల్లికలు లిఫ్ట్ పనులు

*రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాశాంతి పార్టీ అధినేత కే.ఏ.పాల్ సంబంధం లేని మాటలతో ఇచ్చే హామీలు, మాట్లాడే మాటలు చాలామందికి నవ్వు తెప్పిస్తాయి. అదే కోవలోకి వస్తాడు కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్. రోడ్లు బాగా లేవనే విషయాన్ని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, తాను ఫాలో అప్ చేసి సమస్యలు పరిష్కరిస్తానంటూ చెప్పడంతో తలలు పట్టుకోవడం ఆ పార్టీ కార్యకర్తల వంతయ్యింది. – బంజారాహిల్స్*

## పారాచూట్ లీడర్

# గిట్లనే ఉంటడు!

- అవగాహన లేమితో కామెడీ పండిస్తున్న జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్




**ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతుంటాయి. అభ్యర్థులు ఆరోపణలు, ప్రత్యారోపణలతో పాటు వ్యక్తిగత దూషణలకు దిగుతుండడం సర్వసాధారణం. ఎన్నికల ప్రచారం ఊపందుకునేకొద్దీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతుంటాయి. అయితే, కొంతమంది నాయకులు, అభ్యర్థులు చేసే కామెంట్స్ కామెడీని పండిస్తుంటాయి. అలాంటి వారిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజాశాంతి పార్టీ అధినేత కే.ఏ.పాల్‌దే అందెవేసిన చేయి. సంబంధం లేని మాటలతో పాల్ ఇచ్చే హామీలు, మాట్లాడే మాటలు చాలామందికి నవ్వు తెప్పించేవిగా ఉంటాయి.**

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ పారాచూట్ అభ్యర్థి, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ రెండు రోజుల క్రితమే రంగంలో దిగారు. నియోజకవర్గంతో ఏ మాత్రం సంబంధం లేని ఆయన మీడియాతో మాట్లాడే మాటలు కే.ఏ.పాల్‌ను గుర్తుకు తెస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తొలిరోజు నియోజకవర్గంలో కార్యకర్తల సమావేశం ఎక్కడ జరుగుతుందని మీడియా అడిగిన ప్రశ్నలకు మహబూబ్‌నగర్‌లో అంటూ జవాబు ఇవ్వడం అక్కడున్న కార్యకర్తలను విస్మయానికి గురిచేసింది. వాస్తవానికి సమావేశం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో అని పక్కనున్న కార్యకర్తలు సర్దిచెప్పాల్సి వచ్చింది.

### • ఏం పనిచేయాలో తెలియదు..

నియోజకవర్గంలో కార్యకర్తల సమావేశం అనంతరం అజారుద్దీన్‌ను మీడియా ప్రతినిధులు పలకరించారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయని వారు అడిగిన ప్రశ్నలకు నీళ్లు నమిలిన అజ్జూ భాయ్.. తాను నియోజకవర్గంలో పనిచేయడం కోసం వచ్చానని, ఏం పనిచేయాలో తెలియదు అంటూ చెప్పడంతో మీడియా ప్రతినిధులు అవాక్కయ్యారు.

### • రోడ్లు బాగా లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయండి

రోడ్లు బాగా లేకపోతే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. మురుగు సమస్యలు ఉంటే జలమండలి అధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఏదైనా నేరం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కానీ, కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌కు మాత్రం ఇవన్నీ తెలియదు. నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభించిన ఆయనను అభివృద్ధి ఎలా ఉందని మీడియా ప్రశ్నించగా, తనకు అభివృద్ధి కనబడడం లేదని, రోడ్లు సరిగా లేవని, ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, తాను ఫాలో అప్ చేసి సమస్యలు పరిష్కరిస్తానంటూ చెప్పడంతో అక్కడున్న కాంగ్రెస్ కార్యకర్తలు తలలు పట్టుకున్నారు.